# ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్నే గెలిపించుకోవాలి

● ప్రజల ఆశీస్సులతో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తుంది: దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, అక్టోబర్18: ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్నే గెలుపించుకోవాలని, 60 ఏండ్లలో ఏ పార్టీ చేయని విధంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత తొమ్మిదిన్నర ఏండ్లల్లో ప్రజా సంక్షేమం కోసం కృషిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని మెదక్ పార్లమెంట్ సభ్యులు, బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నార్సింగి మండలం వల్లూర్‌లో బుధవారం గ్రామస్తులతో ఆత్మీయ సమ్మేళనంలో కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధితో పాటు గ్రామానికి కావాల్సిన అభివృద్ధిపై గ్రామ ప్రజలు ఎంపీకి వివరించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున్న, ఎన్నికల తరువాత కావాల్సిన అభివృద్ధి పనులను చేసుకుందామని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రతి ఒక్కరూ పార్టీకోసం కలిసికట్టుగా పనిచేసి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ఇంటింటికి తీసుకెళ్లి ప్రజలు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పలువురు ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి భారీ మెజార్టీ గెలిపించుకుంటామని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు సోలిపేట సతీశ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ ఆనందాస్ మహేశ్వరీనరేశ్, ఎంపీపీ చిందం సబిత, జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలరాం బాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు వాయిద్, మాజీ సర్పంచులు తదితరులు ఉన్నారు. అనంతరం నార్సింగి మండలం వల్లూర్‌లో దొడ్ల ఎల్లవ్వ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు.



నార్సింగి మండలం వల్లూర్‌లో పర్యటిస్తున్న బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

# ఒక్కేసి పువ్వేసి చందమామ..

బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక: రామాయంపేట తహసీల్దార్ రజనీకుమారి

రామాయంపేట/చిన్నశంకరంపేట/ నర్సాపూర్/ వెల్దుర్తి/ చేగుంట, అక్టోబర్ 18: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగను స్నేహ డిగ్రీ కళాశాల విద్యార్థినులతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని, రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఒక్కచోట చేరి ఆడబిడ్డలతో పాటు బతుకమ్మ సంబురాల్లో భాగమవ్వడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని రామాయంపేట తహసీల్దార్ రజనీకుమారి, కమిషనర్ ఉమాదేవి అన్నారు. బుధవారం రామాయంపేట పట్టణంలోని స్నేహ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కళాశాల యాజమాన్యం బతుకమ్మల పోటీలను నిర్వహించింది. పోటీలలో ప్రతిభను చాటిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మన తెలంగాణ రాష్ట్ర పండుగ ఈ పండుగను ఆడపిల్లలు ఎవ్వరూ మరచిపోవద్దని, గత ప్రభుత్వాల బతుకమ్మ పండుగను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కవిత స్ఫూర్తితో బతుకమ్మకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. మన సంస్కృతి సంప్రదాయలను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహిస్తున్నామని స్నేహ కళాశాలల వ్యవస్థాపకుడు వలిశెట్టి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, విద్యార్థులతో పాటు వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

☛ రామాయంపేట పట్టణంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ, మహంకాళి అమ్మవారి దేవాలయంలో, బీసీ కాలనీ, రెడ్డి కాలనీ దుర్గమ్మ బస్తీ, కేసీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా జరుపుకుంటున్నారు. మహిళలు బతుకమ్మలను తంగేడు, గునుగు పూలతో పేర్చి ఆడిపాడుతున్నారు. అనంతరం బతుకమ్మలను గౌరమ్మ పాటలు పాడి చెరువుల్లో నిమజ్జనాలు చేశారు. మహంకాళి ఆలయంలో మహిళా భక్తులు కోలాటాల ఆటలను ఆడారు. మండలంలోని ఆర్.వెంకటాపూర్, అక్కన్నపేట, తొనిగండ్ల, లక్ష్మాపూర్, కాట్రియాల, దంతెపల్లి, పర్వతాపూర్, ఝాన్సీలింగాపూర్, కోనాపూర్ తదితర గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను మహిళలు జరుపుకుంటున్నారు.

☛ చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం మహిళలు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలని పేర్చి గ్రామంలో ప్రధాన వీధుల వద్ద మహిళలు బతుకమ్మలు ఆడారు. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు.

☛ నర్సాపూర్ పట్టణంలోని ఎల్లంకి డిగ్రీ, ఇంటర్మీడియట్ ప్రైవేట్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు బుధవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

☛ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి కళాశాల ఆవరణలో బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

☛ చేగుంట, నార్సింగిలో బతుకమ్మ వేడుకలు కోలాహలంగా సాగుతున్నాయి. రంగురంగు పూలతో తయారు చేసిన బతుకమ్మలను ఒక్కచోటికి చేర్చి.. రామరామ ఉయ్యాలో.. జయరామరామ ఉయ్యాలో, ఒక్కేసి పువ్వేసి చందమామ.. అంటూ పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం ఊర చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. చేగుంట ప్రభుత్వ కళాశాలో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిప్రసాద్‌నాయుడు, అధ్యాపకులు ప్రమీలరాణి, లైబ్రేరియన్ గ్రేస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రమోద్‌కుమార్, స్వర్ణలత, ఫర్జానా పాల్గొన్నారు.



చేగుంట ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మలను తీసుకువెళున్న విద్యార్థినులు, అధ్యాపకులు



చిన్నశంకరంపేటలో బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న తహసీల్దార్ రజనీకుమారి, కమిషనర్ ఉమాదేవి



వెల్దుర్తి ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

## పకడ్బందీగా ఐకేపీ కేంద్రాల నిర్వహణ



మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్

మెదక్ అర్బన్, అక్టోబర్18: ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ ఏడాది పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సమైక్య కార్యాలయంలో ఏపీఎం, సీసీలకు ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి మండలానికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య ఆధారంగా లారీలు కేటాయిస్తామన్నారు. గోనె సంచుల రిక్వైర్మెంట్‌కి సంబంధించి వాట్సాప్ ద్వారా ఇండెంట్ పంపిన వారికి 24 నుంచి 48 గంటలలో గోనె సంచులు సరఫరా చేస్తామని తెలిపారు.

ఈ సంవత్సరం కొత్తగా లారీల ట్రాకింగ్ కోసం ఒక యాప్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ డీఎం సివిల్ సప్లై డీఎస్ఓ, డీపీఎంలు మోహన్, ప్రకాశ్, రీజనల్ మేనేజర్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

## మాతృ మరణాలను నివారించాలి

మెదక్ అర్బన్, అక్టోబర్ 18: మాతృ మరణాలను నివారించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో 'మాతృ మరణాల నివారణ కమిటీ' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృ మరణాలు జరగడానికి గల కారణాలు, నివారణ చర్యల గురించి చర్చించారు. మాతృ మరణాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హైరిస్క్ మరణాలపై కమిటీ రిపోర్ట్ సమర్పించాలని సూచించారు. మాతృ మరణాలు జరిగిన కుటుంబీకులతో డాక్టర్‌ల కమిటీ సమక్షంలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎమ్‌లు హైరిస్క్ కేసులను గుర్తించి త్వరితగతిన ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చందు నాయక్, అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయ నిర్మల, డాక్టర్ మాధురి, పీఓ ఎంసీహెచ్ డాక్టర్ శివదయాల్, తదితరులు పాల్గొన్నారు.



ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

## జిల్లాలో విస్తృతంగా వాహన తనిఖీలు

● వివరాలు తెలిపిన జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ అర్బన్, అక్టోబర్18: ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో జిల్లా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారని జిల్లా ఎస్పీ రోహిణిప్రియదర్శిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలైనప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.44,33,187 నగదు, 1074.17 లీటర్లు మద్యం (విలువ రూ.6, 61,102.5) 0.165 కిలోగ్రాముల గంజాయి (విలువ రూ.4,125), 328.9 క్వింటాళ్ల బియ్యం (విలువ రూ.3,47,400)తోపాటు బుధవారం జిల్లా వ్యాప్తంగా రూ.7,34,200 నగదు కలిపి మొత్తం రూ. 51,45,814.5 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని ఆధారాలు లేని నగదు, మద్యం, ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంటుందని హెచ్చరించారు. ప్రజలు రూ.50 వేల నగదుకంటే ఎక్కువ మొత్తంలో తీసుకెళ్లే వారు పెద్ద మొత్తంలో బంగారం, ఇతర వస్తువులును తీసుకెళ్లేవారు సరైన పత్రాలు చూపాలని సూచించారు. సరైన పత్రాలు చూపకపోతే నగదు ఇతర వస్తువులు బంగారం అభరణాలు సీజ్ చేస్తామని ఎస్పీ వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

అల్లాదుర్గం, అక్టోబర్18: దసరా పండుగను సొంత గ్రామంలో జరుపుకోవడానికి వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో దంపతులు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం మంగళవారం రాత్రి గడిపెద్దాపూర్ జాతీయ రహదారిపై జరిగింది. ఏఎస్ఐ దేవీదాస్ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బొల్కంపల్లికి చెందిన దేవమణి(58), భర్త నారాయణ(62) వారి పిల్లలు సిద్ధార్థ, దీపిక, నవ్వవాణిలతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి సొంత గ్రామానికి దసరా పండుగకు వెళ్తుండగా మార్గమధ్యలో గడిపెద్దాపూర్ గ్రామ శివారు వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో దేవమణి అక్కడికక్కడే మృతి చెందగా, భర్త నారాయణను 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా అక్కడ మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన దీపిక, నవ్వవాణి, సిద్ధార్థలను చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడు నారాయణ తమ్ముడు బాల్‌రాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఫిర్యాదు చేస్తున్నట్లు ఏఎస్ఐ దేవీదాస్ పేర్కొన్నారు.